సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 26 । నవంబర్ । 2023



రోగులకు మెరుగైన వైద్యం

రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు.

8లో



సింహగిరి కిటకిట

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఘనంగా చండీ హోమం

మోతుగూడెం: పొల్లూరు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీ గణపతి సహిత మహా మృత్యుంజయ చండీ హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మధుచందన ప్రతిభ

- బంగారు పతకం కైవసం
- జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



చింతూరు: కర్నూలులో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్థానిక కస్తూర్బా విద్యార్థిని గుత్తుల మధుచందన బంగారు పతకం సాధించింది. అండర్–17 విభాగం 81 ప్లస్ కేటగిరీలో ఆమె ప్రతిభ కనబరిచడమే కాకుండా డిసెంబరులో బిహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మంచి ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించిన ఆమెను ఎంఈవో లక్ష్మీనారాయణతో పాటు కళాశాల ఉపాధ్యాయులు, కోచ్ గంగాధర్ తదితరులు అభినందించారు.

పుణ్యనదీ హారతి రేపు



వరాహ పుష్కరిణి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన కొండదిగువ వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. నక్షత్ర హారతి, కుంభ హారతి, ఆయుత దీపార్చనలు సమర్పణ ఉంటుందన్నారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణి గట్టుపై దీపాలు వెలిగిస్తారన్నారు.

వరుస దొంగతనాలతో రైతుల్లో ఆందోళన

- మూడు రోజుల్లో ఆరు బ్యాటరీలు, బైక్ చోరీ



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్

ఎటపాక: మండలంలోవరుస దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.గత మూడు రోజుల్లో తోటపల్లి, గన్నవరం, నందిగామ గ్రామాల్లో ఆరు బ్యాటరీలు, ద్విచక్రవాహనం చోరీకి గురయ్యాయి. రైతులు ఇంటి ముందు నిలిపి ఉంచిన ట్రాక్టర్లనే టార్గెట్ చేసుకుని బ్యాటరీలు దొంగిలిస్తున్నారు. వీరిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. గ్రామాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం, ఏజెన్సీ గ్రామాల్లో రాత్రి సమయాల్లోనే దొంగతనాలు జరుగుతుండటంతో దొంగలను గుర్తించడం ఇబ్బందిగా మారింది. సరిహద్దున తెలంగాణకు చెందిన కొంతమంది ఈ చోరీలకు పాల్పడుతున్నట్టుగా స్థానికుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్‌ఐ పార్థసారధిని వివరణ కోరగా గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పర్యాటక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : జాతీయ పర్యాటక పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి గరికిన దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ గ్రామీణ పర్యాటకం, గ్రామీణ ప్రాంతాల్లో వన విభాగం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని చెప్పారు. సంబంధిత రంగాల్లో అనుభవం, ఆసక్తి గత సంస్థలు పూర్తి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఉత్తమ గ్రామీణ హోమ్ పోటీ 2023 పేరిట పోటీలను నిర్వహిస్తోందన్నారు. సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పెంపొందించేందుకు పర్యాటక లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడంపై దృష్టి పెట్టిందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పూరించాలని, ఆంగ్ల భాషలోనే ఆమోదించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

1505 మంది.. 2,555 ఎకరాలు

సొంతభూమి లేని పేద గిరిజనుల కల సాకారం కానుంది. జిల్లాలోని 21 మండలాల్లో అసైన్డ్ భూముల పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. 188 గ్రామాలకు చెందిన 1508 మంది లబ్ధిదారులకు 2,555 ఎకరాలకు పూర్తి హక్కులు దాఖలు పడనుండటంతో వారిలో పట్టరాని ఆనందం నెలకొంది.

- అసైన్డ్ సాగు భూములకు యాజమాన్య హక్కులు కల్పించిన ప్రభుత్వం
- 21 మండలాల్లో పట్టాల పంపిణీకి శ్రీకారం
- 188 గ్రామాల్లో ప్రక్రియ
- దశాబ్దాల కల నెరవేరిన వేళ
- పేద గిరిజనుల్లో ఆనందం



అసైన్డ్ భూముల లబ్ధిదారుల కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన పట్టా



చింతూరు మండలం గంగన్నమెట్టలో గిరి రైతు సాగు చేస్తున్న అసైన్డ్ భూమి

చింతూరు: జిల్లాలో ఎన్నో ఏళ్లగా సొంతభూమి లేని చాలామంది గిరిజనులు ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ భూములు కావడంతో రైతుభరోసాతో పాటు పంటలు నష్టపోయిన సమయంలో పరిహారానికి దూరమవుతున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం 20 ఏళ్లగా ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న సంబంధిత రైతులకు ఆ భూములపై పూర్తి హక్కులు కేటాయించేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2003 జూలై 31కు ముందు నుంచి అసైన్డ్ భూముల్లో సాగులో ఉన్న లబ్ధిదారులకు ఆ భూములపై యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. దీంతో జిల్లాలో 188 గ్రామాలకు చెందిన 1508 మంది లబ్ధిదారులకు 2,555 ఎకరాలపై పూర్తి హక్కులు దాఖలు పడనున్నాయి.

అసైన్డ్ కమిటీ ఆమోదంతో..

భూముల రికార్డులను క్రమబద్ధీకరణలో భాగంగా అధికారులు గిరిజనుల సాగులో ఉన్న అసైన్డ్ భూములను గ్రామాల వారీగా గుర్తించారు. వీటి ఆధారంగా డీకేటీ రిజిస్టర్లు, వన్‌బీ, అడంగళ్లు, ఇతర రికార్డులను తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం తహసీల్దార్లు సమర్పించిన తుది జాబితాలను సబ్‌కలెక్టర్, ఆర్డీవోలతో పాటు జాయింట్ కలెక్టర్ నిశితంగా పరిశీలించాక ముసాయిదా జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపారు. దీనికి అసైన్డ్ కమిటీ ఆమోదం లభించడంతో లబ్ధిదారుల జాబితా మండల రెవెన్యూ కార్యాలయాలకు చేరింది. దీనిపై తహసీల్దార్లు సంబంధిత రైతుల పేర్లతో సర్వే, ఖాతా నంబర్లు కేటాయించి వెబ్‌ల్యాండ్‌లో పొందుపరిచారు.

మంజూరైన పట్టాల వివరాలు

పాడేరు డివిజన్: అనంతగిరి మండలంలో 10 గ్రామాలకు చెందిన 118 మంది లబ్ధిదారులకు 175.06 ఎకరాలు, అరకువ్యాలీ మండలంలో 12 గ్రామాలకు చెందిన 125 మందికి 138.57, చింతపల్లి మండలంలో 13 గ్రామాలకు చెందిన 220 మందికి 192.84, డుంబ్రిగూడ మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 52 మందికి 78.03, జీమాడుగుల మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 41 మందికి 73.46, జీకేవీధి మండలంలో తొమ్మిది గ్రామాలకు చెందిన 83 మందికి 98.69, హుకుంపేట మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 91 మందికి 82.68, కొయ్యూరు మండలంలో ఏడు గ్రామాలకు చెందిన 65 మందికి 98.78, ముంచంగిపుట్టు మండలంలో ఏడు గ్రామాలకు చెందిన 106 మందికి 184.87, పాడేరు మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 56 మందికి 34.68, పెదబయలు మండలంలో ఒక గ్రామానికి చెందిన 59 మందికి 113.16 ఎకరాలకు పట్టాలు మంజూరయ్యాయి.

రంపచోడవరం డివిజన్: అడ్డతీగల మండలంలో 14 గ్రామాలకు చెందిన 45 మందికి 100.16 ఎకరాలు, రాజవొమ్మంగి మండలంలో 12 గ్రామాలకు చెందిన 30 మందికి 59.28, రంపచోడవరం మండలంలో 16 గ్రామాలకు చెందిన 53 మందికి 95.19, దేవీపట్నం మండలంలో 8 గ్రామాలకు చెందిన 20 మందికి 65.26, గంగవరం మండలంలో 18 గ్రామాలకు చెందిన 57 మందికి 99.73, మారేడుమిల్లి మండలంలో మూడు గ్రామాలకు చెందిన 10 మందికి 26.15, వైరామవరం మండలంలో 6 గ్రామాలకు చెందిన 17 మందికి 37.67 ఎకరాలకు పట్టాలు ఇవ్వనున్నారు.

చింతూరు డివిజన్: కూనవరం మండలంలో 5 గ్రామాలకు చెందిన 35 మందికి 109.04 ఎకరాలు, ఎటపాక మండలంలో 17 గ్రామాలకు చెందిన 177 మందికి 563, చింతూరు మండలంలో 10 గ్రామాలకు చెందిన 48 మందికి 124.32 ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరయ్యాయని అధికారవర్గాలు తెలిపాయి.

ఎంతో ఆనందం



సొంతభూమి లేకపోవడంతో ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పట్టాకోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నా. సాగు చేసిన భూమికి పట్టా రావడం ఆనందంగా ఉంది.

– సోయం దూలయ్య, గంగన్నమెట్ట, చింతూరు మండలం

ఇబ్బందులు తప్పాయి



సాగు చేసుకుంటున్న భూమిపై హక్కులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో సొంత భూమి కల నెరవేరింది. ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న తమకు యాజమాన్య హక్కులు దక్కనున్నాయి.

– పద్దం కిట్టమ్మ, గంగన్నమెట్ట, చింతూరు మండలం

నిశ్చింతగా సాగు



ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు అసైన్డ్ పట్టాల నిర్ణయంతో ఎంతో మేలు జరగనుంది. సంబంధిత భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించబడతాయి. ఇకపై వారు నిశ్చింతగా భూములను సాగుచేసుకునే వీలుంది.

– కావూరి చైతన్య, ఐటీడీఏ పీవో, చింతూరు

సెక్షన్ అధికారి, ఎఫ్‌బీవో సస్పెన్షన్

- టేకు చెట్ల అక్రమ నరికివేతపై చర్యలు
- చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ ఉత్తర్వులు

కొయ్యూరు: మర్రిపాకల రేంజ్‌లో టేకు చెట్ల అక్రమ నరికివేతపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో అటవీ సిబ్బందిపై వేటు పడింది. యూ.చీడిపాలెం సెక్షన్ అధికారి చంద్రశేఖర్, ఎఫ్‌బీవో రమణను చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ సస్పెండ్ చేశారు. దాదాపుగా రెండు నెలల క్రితం యూ చీడిపాలెం–యర్రగొండ మధ్యలో సుమారు 38 వరకు టేకు చెట్లు అక్రమ నరికివేతకు గురయ్యాయి. వీటిలో మూడు చెట్లను అక్కడ బేస్ క్యాంప్ సిబ్బంది బయట వారికి విక్రయించారు. వాటిని తరలిస్తున్న సమయంలో అడ్డతీగలకు చెందిన అటవీ సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. దీనిపై సబ్ డీఎఫ్‌వో బెర్నర్డ్‌రాజు విచారణ నిర్వహించి నివేదిక అందజేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించిన డీఎఫ్‌వో ఇద్దరిని సస్పెండ్ చేశారు. దీనిపై రేంజర్ భార్గవ్‌వర్మ మాట్లాడుతూ తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు.

డ్రోన్‌తో సాగుపై అవగాహన



రంగబయలులో డ్రోన్‌తో సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ కేంద్రంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం అధికారులు నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. రైతులు ఆవు పేడ, మూత్రంతో స్వచ్ఛమైన ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. డ్రోన్ కెమెరాతో త్వరితగతిన పురుగు మందు పిచికారీ చేసే విధానం, పంట పొలాల్లో వినియోగంపై వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, సర్పంచ్ దనియా పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ చరిత్రాత్మకం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రైతుకు హక్కు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

అనంతగిరి: భూహక్కు పత్రాలు, అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ చరిత్రాత్మకమని, గిరిజనుల తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శనివారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో పట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ రాంబాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని భూసమస్యల పరిష్కారానికి రాష్ట్రముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం మరిచిపోలేమన్నారు. భూ రీసర్వే ద్వారా శాశ్వత భూ హక్కుపత్రాలు జారీ చేయడం అంటే చిన్నవిషయం కాదని, తరతరాలు గిరిజనులు పడుతున్న ఇబ్బందికి శాశ్వత పరిష్కారం చూపారన్నారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగాలన్నాదే సీఎం లక్ష్యమని, అదిశగా అడుగులు వేస్తున్నారు. మండలంలో మొదటి విడతలో 221 మంది గిరిజన రైతులకు 450 ఎకరాలకు శాశ్వత భూహక్కులు పత్రాలు పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా 96 మందికి డి.ఫారం హక్కు పత్రాలు, అలాగే 2003 ముందుగల 33 మంది గిరిజన రైతులకు రెగ్యులర్ చేస్తూ పట్టాలు పంపిణీ చేశామన్నారు. పట్టాలు పంపిణీలో కీలకపాత్ర వహించిన తహసీల్దార్ రాంబాయి సేవలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం సత్కరించారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టినీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, మండలపార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, డీటీ మాణిక్యం, రీసర్వే రామ్మూర్తి, ఆర్ఐ శంకరరావు, సర్పంచ్‌లు అప్పారావు, సింహాద్రి, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

- జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి

చింతపల్లి రూరల్: ప్రభుత్వం నాడు–నేడు రెండవ దశలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా నోడల్ అధికారి కె.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల సమావేశ మందిరంలో స్థానిక సీడీపీవో రమణి అధ్యక్షతన అంగన్‌వాడీ అభివృద్ధి కమిటీలకు శిక్షణ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 84 కేంద్రాలు మౌలిక వసతుల కల్పనకు ఎంపికయ్యాయన్నారు. ఈమేరకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. చేపట్టనున్న పనులకు సంబంధించి కమిటీ సభ్యులు త్వరగా బ్యాంక్‌లో ఉమ్మడి ఖాతాలు తెరవాలన్నారు. నాణ్యత ప్రమాణా లతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎంఈవోలు వనపల ప్రసా ద్, గెమ్మిలి బోడం నాయుడు, ఎస్ఎంఐ ఏఈఈ లోకే ష్ కుమార్, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహర్ ఎన్నీషా, సత్యవతి, గౌరి, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొంతులమ్మ కొండపై శివపార్వతుల విగ్రహాలు

- ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి



దొంతులమ్మ కొండపై ఏర్పాటు చేయనున్న శివపార్వతుల విగ్రహం

చింతపల్లి రూరల్: మండలంలో తాజంగిలోని దొంతులమ్మ అమ్మవారి కొండపై సోమవారం స్థానిక భక్తుల సహకారంతో శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎంపీపీ కోరాబు అనూషదేవి, సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథులుగా సద్గురు సేవాశ్రమం స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త కొండ వీటి జ్యోతిర్మయి విచ్చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట (విశాఖ) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించబడిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 15 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రామ సచివాలయాలతో సత్వర సేవలు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గ్రామసచివాలయ భవన ప్రారంభ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ప్రభుత్వ పాలనను గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చి సత్వర న్యాయం లక్ష్యంగా గ్రామసచివాలయాల వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరడాపల్లి, గొండెలి పంచాయతీ కేంద్రాల్లో నిర్మించిన గ్రామసచివాలయాల భవనాలను శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామసచివాలయాల వ్యవస్థ అద్భుతమని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయన్నారు.పరిపాలన వికేంద్రీకరణతో పాలనను గ్రామస్థాయిలోకి అందుబాటులోకి తెచ్చి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులమంతా రుణపడి ఉంటామన్నారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, జెడ్పీటీసీ గాయత్రీదేవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి,మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, ఎస్టీసెల్ జోనల్ విభాగం ఇన్‌చార్జి కిముడు విశ్వ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వెంకటేశ్వరనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జీసీసీ కాఫీ స్టాల్

- ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- అందుబాటులో ఉత్పత్తులు
- కొనుగోలు చేసి ప్రోత్సహించాలని సూచన



కాఫీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని అన్ని వర్గాల ప్రజలు జీసీసీ ఉత్పత్తులను వినియోగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో జీసీసీ ఏర్పాటు చేసిన కాఫీ స్టాల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులకు కాఫీ మంచి ఉపశమనం ఇస్తుందన్నారు. కాఫీ స్టాల్‌లో అందుబాటులో ఉన్న జీసీసీ ఉత్పత్తులను ఉద్యోగులు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన రైతులు కూడా కాఫీ ఫలసాయాన్ని జీసీసీకి విక్రయించి మంచి ఆదాయం పొందాలని కోరారు. కాఫీ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు అవసరమైన జీసీసీ సంస్థ ఉద్యోగులు, పూల్ ఏజెంట్ల నంబర్లను ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని పాడేరు జీసీసీ డీఎం సింహాచలాన్ని ఆదేశించారు. డీఆర్వో అంబేద్కర్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.మురళీకృష్ణ, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధి చిన్నికృష్ణ, ఏపీ ఎంపీ పీడీ రహీం, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శ్యాంకుమార్, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవనగిరిలో సత్యదీక్షల స్వీకరణ


సత్యదీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో శనివారం తొమ్మిది రోజుల సత్య దీక్షల స్వీకరణలో భాగంగా 260 మందికి మాలధారణ చేయించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట రామయ్య,విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మన్యంలోని 11 మండలాల నుంచి వచ్చిన భక్తులతో మాలధారణ గావించారు. తొలుత పవనగిరి క్షేత్రంలోని పలు దేవాలయాల్లో పూజాధికాలు నిర్వహించారు. అనంతరం మాలధారణ చేయించిన భక్తులచే శ్రీ రమా సత్యనారాయణస్వామి వారికి పూజలు చేయించారు.

జలపాతం వద్ద జారిపడిన యువకుడు

- తీవ్ర గాయంతో పీహెచ్‌సికి తరలింపు


చికిత్స చేస్తున్న సిబ్బంది

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగూడ జలపాతం వద్ద శనివారం ప్రమాదశాత్తూ జారిపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చారు. తాటిగూడ జలపాతాన్ని తిలకిస్తుండగా ప్రియరంజన్‌విశ్వ (20) అనే యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడడంతో తలకు తీవ్రం గాయమైంది. వెంటనే స్నేహితులు అతనిని ఆటోలోని స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యసిబ్బంది చికిత్స అందించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హుకుంపేట: మండలంలోని నిమ్మలపాడు, దారంబందలు, అల్లంపుట్టు, దారగెడ్డ గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానికులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్డు, తాగునీటి పథకం తదితర సమస్యలు పరిష్కరించి, అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రామ్మూర్తి, మాజి సర్పంచ్ అప్పలస్వామి, నాయకులు అప్పలరాజు, కొండబాబు, సుబ్బారావు, రమేష్, సూరిబాబు, దావీదు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

స్వగ్రామానికి వెళుతుండగా కబళించిన మృత్యువు

మత్రిపాలెం (విశాఖ): రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన శనివారం కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో శీర ఈశ్వరరావు (55) వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. శనివారం 9.15 గంటలకు భార్య దేవుడమ్మ (50)తో కలిసి స్కూటీపై సొంతూరు దేవరాపల్లి మండలం రైవాడ బయలుదేరాడు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోగా తీవ్రగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన కేజీహెచ్‌కి తరలించారు. ఈశ్వరరావు అప్పటికే మృతి చెందగా, భార్య దేవుడమ్మ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వారి కుమార్తె కోరాడ ఆదిలక్ష్మి పోలీసులకు ఇచ్చిన


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరరావు

ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈశ్వరరావు హెల్మెట్ ధరించి ఉన్నా ఇలా జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ కేసును ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైవాడలో విషాదఛాయలు

దేవరాపల్లి: శీర ఈశ్వరరావు దంపతుల దుర్మరణంతో వారి స్వగ్రామం రైవాడలో విషాదం నెలకొంది. వారు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం విశాఖపట్నం వెళ్లారు. ఆంజనేయస్వామి మాల ధరించిన ఈశ్వరరావు తన భార్య దేముడమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తుండగా ఈ దారుణం జరిగింది. రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలిద్దరూ మృతి చెందారు. వీరికి వివాహి


శీర ఈశ్వరరావు, దేముడమ్మ (ఫైల్)

తురాలైన ఒక కుమార్తె ఉంది. తల్లిదండ్రులు ఒకేసారి మరణించడంతో కుమార్తెతోపాటు కుటుంబ సభ్యులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మృతదేహాలకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం రైవాడకు తీసుకువచ్చారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరి మృతికి వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవాని, సర్పంచ్ చల్లా లక్ష్మి, ఉగ్రూకుల అప్పారావు, చల్లా నాయుడు తదితర్లు సంతాపం ప్రకటించారు.

తూనికలు, కొలతల్లో మోసాలు చేస్తే కఠిన చర్యలు


ముంచంగిపుట్టు వారపు సంతలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ముంచంగిపుట్టు: తూనికలు, కొలతలలో వ్యాపారస్తులు వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ విశాఖ జిల్లా సహాయ నియంత్రకులు పిడివి అప్పలరాజు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి పంటలు కొనుగోలు చేస్తున్న వ్యాపారుస్తుల కాటాలను పరిశీలించి, తనిఖీ చేశారు.ముద్రకాబడని కాటాలను వినియోగిస్తున్న ఐదుగురు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులపై కేసులు నమోదు చేశారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువుల బరువులను సరిచూసుకోవడానికి ధర్మ కాటను ఏర్పాటు చేసి కొలతలలో తేడాపై వివరించారు.వినియోగదారులతో మాట్లాడి కొనుగోలు చేస్తున్న ధరలపై అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో తూనికలు,కొలతలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తూనికలు,కొలతలు శాఖ జిల్లా సహాయ నియంత్రకులు పిడివి అప్పలరాజు మాట్లాడుతూ వ్యాపారస్తులు నిబంధనలు పాటిస్తూ వ్యాపార లావాదేవీలు చేయాలన్నారు.గిరిజన ప్రాంతంలో గిరిజనుల అమాయకత్వాని ఆసరాగా చేసుకొని వ్యాపారులు కొలతలు,తూనికల్లో వ్యత్యాసం చూపితే కేసులు నమోదు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు,పాడేరు సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ ప్రయాణంపై పోలీసుల ఉక్కుపాదం

- కూలీల తరలింపును అడ్డుకున్న పోలీసులు
- 8 వ్యాన్‌లు స్టేషన్‌కు తరలింపు


పోలీసులు అదుపులో తీసుకున్న మినీ వ్యాన్

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో పాడేరు ప్రాంతానికి చెందిన గిరిజన కూలీలను ఓవర్‌లోడుతో వ్యాన్‌ల ద్వారా విజయవాడకు తరలిస్తున్న అక్రమ ప్రయాణాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. 8 మినీ వ్యాన్‌లలో 300 మంది గిరిజన కూలీలను విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు తరలించడాన్ని పోలీసులు శనివారం పాడేరు సమీపంలోని వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. వ్యాన్‌లోని కూలీలను దింపివేసి ఆయా 8 వ్యాన్‌లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. గిరిజన కూలీలను వారి ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. ఇటీవల ఐనాడ ఘాట్‌లో వరి కోతలకు వెళ్తున్న గిరిజన కూలీల వ్యాన్ లోయలోకి దూసుకుపోయిన సంఘటనలో ఓ గిరిజనుడు మృతి చెందడం, మరో 14 మందికి గాయాలు కావడంపై పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఓవర్‌లోడ్ ప్రయాణాలపై దృష్టి సారించారు.

ధర్మాపురం ఘాట్‌లో కారు బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

సీలేరు: ధారకొండ పంచాయతీ ధర్మాపురం ఘాట్‌లో కారు అదుపు తప్పి లోయలోకి బోల్తా కొట్టింది. గాలికొండ పంచాయతీలో సెల్ టవర్ల పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో కారులో ఏడుగురు ప్రయాణికులు ఉండగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మార్గంలో వెళ్తున్న కాఫీ రైతులు ప్రమాదాన్ని గుర్తించారు. వెంటనే కారులో ఉన్న ప్రయాణికులను బయటకు తీసి ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన


ధారకొండ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

డ్రైవర్ సాల్మన్, పురాఖాన్‌ను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ప్రాణాపాయం ఎవరికీ లేదన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల వివరాలను సూపరింటెండెంట్ డా. లక్ష్మి నుంచి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న భవనాన్ని త్వరగా పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని పీవో ఆదేశించారు. వైద్య సేవల విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓపీ, ఇన్ పేషెంట్లు, ప్రసూతి కేసులు, కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన సేవలు అందించాలన్నారు. జగనన్న సురక్ష కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న వారికి పీవో చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. సిలబస్‌ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు నిబంధనల ప్రకారం ప్రతిరోజు అందించాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తక్షణం సమీప పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని ఆదేశించారు.

ఓలిమామిడిలో తాగునీటి సమస్య పరిష్కారం

రూ.7.5 లక్షలతో తాగునీటి పథకం

సాక్షి,పాడేరు: జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీలోని ఒడిశా సరిహద్దు గిరిశిఖర గ్రామమైన ఓలిమామిడిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సమస్యను గుర్తించిన కలెక్టర్ సుమిత్‌కుమార్,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకున్నారు. సుమారు 20మంది ఆదివాసీలు జీవిస్తున్న ఈ గ్రామానికి రూ.7.50లక్షలతో జలజీవన్‌మిషన్ ద్వారా గ్రావెటీ తాగునీటి పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కొండమీద నుంచి వృథాగా పోతున్న ఊటనీటిని పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా గ్రామానికి మళ్లించేలా పథకాన్ని నిర్మించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పనులు జరిగాయి. కుళాయిలను శనివారం ఆయన ప్రారంభించారు. కలుషిత నీటి నుంచి గ్రామస్తులకు విముక్తి లభించింది.


ఓలిమామిడిలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ విజయ్‌కుమార్, గిరిజనులు

30న విశ్వనాథుని ఆలయంలో హోమాలు, అభిషేకాలు


విశ్వనాథుని ఆలయం

వై.రామవరం: కార్తీకమాసం, విశేష ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఈనెల 30వ తేదీ గురువారం మండలంలోని విశాలాక్షి, అన్నపూర్ణ సమేత గురమంద విశ్వనాథుని ఆలయం వద్ద హోమాలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు, అన్నసంతర్పణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ పంచాంగ కర్త, వేతపండితులు పళ్లావర్జుల రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పాశుపతి హోమం, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈదైవ కార్యక్రమ పూజల్లో పాల్గొనే దంపతులు ఏవిధమైన రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పూజా సామగ్రిని ఆలయ కమిటీ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. పూజల్లో పాల్గొనే వారి పేర్ల నమోదుకు 6305091545, 6304282966, 6302568635 నంబర్లలో సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తోటపల్లి చేరిన 'అయోధ్య' అక్షింతలు

ఎటపాక: అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ నుంచి స్వామి వారి అక్షింతలు శనివారం తోటపల్లిలోని రామాలయానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో అక్షింతలను ఊరేగింపు రామమందిరానికి చేర్చారు.వీటిని మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లోని 110 గ్రామాల్లో ప్రతి ఇంటికి గ్రామ ధార్మిక జట్టు ద్వారా త్వరలో పంపిణీ చేయనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ చింతూరు డివిజన్ ధర్మ ప్రచారకులు కరి చిన్న శ్రీనివాసరావు, యర్రా నర్సింహరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ముక్కోటేశ్వరరావు, సత్యనారాయణ, చిట్టిబాబు, బాలామణి, శాంతి, శంకర్, రమణ పాల్గొన్నారు.


అక్షింతలను ఊరేగిస్తున్న ధర్మప్రచారకులు